# దిద్దుబాటు

## -ఉపద్రష్ట కృష్ణప్రియ

హఠాత్తుగా మెళుకువ వచ్చింది కాంతానికి. హేమ్లెట్ మంచం మీద లేడు. ''అసలే జ్వరం మండిపోతోంది. ఎక్కడికెళ్ళాడు చెప్మా?'' అని, తెరచి ఉన్న తలుపు తీసుకుని బయటికి నడిచింది ఆత్రంగా.

ఆరుబయట మాలతీ పొదలక్రింద వాలుకుర్చీలో సిగరెట్ ఊదుకుంటూ కనబడ్డాడు అతడు. ''ఏంట్రా హేమూ ఇదీ, ఇలా అర్ధరాత్రి ఒంటరిగా..లే లే..ఇంట్లోకి నడు'' అంటూ బలవంతంగా లోనికి తీసుకుని వెళ్ళింది కాంతం.

''హేమ్లెట్ అనే వ్యక్తి డెన్మార్కు రాకుమారుడుట. మీ మావగారు బి.ఏ చేస్తున్నప్పుడు హేమ్లెట్ నాటకంలో ఆ పాత్ర వేసారు. ఆ సమయంలో వీడు పుట్టాడు. ఆ పాత్రమీద అభిమానంతో వీడికీ పేరు పెట్టారు'' అని నాయనమ్మ అమ్మతో మురిపెంగా చెప్పుకునేదిట.

''ఏం రాకుమారుడో ఏమిటో? వాడి మనసులో ఉన్నది హరిబ్రహ్మాదులకి తెలియదు. వాడిలో వాడు తెగ మథనపడతాడు. మళ్ళీ ఏదో జరిగింది. ఏమై ఉంటుంది చెప్మా'' అనుకుందామె కలవరంగా.

★★★

హేమ్లెట్ కాలకృత్యాలు తీర్చుకుందుకి లేచాడు. అతడి పక్క సర్దే నెపంతో పక్క అంతా సోదా చేసింది కాంతం. అతడు ఏదో ఉత్తరం చదవడం, రెండుమూడు సార్లు ఆమె దృష్టిలో పడడంతో, అతడు తననుంచి ఏదో దాస్తున్నాడన్న అనుమానం ఆమెలో బలపడింది. అన్నీ వెతకగా పిల్లో కవర్‌లో, డైరీలో ఓ కవర్ కనిపించింది. తమ్ముడు వస్తున్న అలికిడి అవడంతో, గభాలున అన్నీ సర్దేసి బయటకి నడిచింది కాంతం, 'డైరీ, లెటరూ' కొంగుచాటున దాచుకుంటూ.

అతడు మౌనంగా రెండిడ్లీ తిని మందులు వేసుకుని టీవీ ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

''ఇప్పుడే వస్తారా. మేడమీద కొద్దిగా పనుంది. రావడం ఆలస్యం అయితే గాభరాపడక పడుకో'' అంటూ మేడ ఎక్కి తాపీగా మంచం మీద కూర్చుని లెటరు విప్పింది.

హేమ్లెట్!

నేనూ, శాంతిని. పేరులోనే తప్ప 'శాంతి' జీవితంలో మృగ్యమైన అభాగినిని. మావారు 'పచ్చి తాగుబోతని', పెళ్ళైన రాత్రే బోధపడింది. వంశగౌరవం తలవంచేట్టు చేస్తే, పరువు ప్రతిష్టలు ఓ ఇల్లాల్ని చేశాయి. పిల్లలిద్దరి మీదా ఆయన దుష్ప్రభావం పడకుండా తీర్చిదిద్దడంలో ఆయనతో రోజూ ఘర్షణే. దాని ఫలితం-అనుక్షణం అనుమానంతో వేధించుకు తిన్నారాయన. పిల్లల చిన్నతనంలోనే, పొలాలు అమ్మగా వచ్చిన డబ్బుతో ఎక్కడికో వెళ్ళిపోయారాయన. చాలా ప్రయత్నాలు ఇరు కుటుంబాలూ చేశాయి ఆయనకోసం. ఎక్కడికి వెళ్ళారో, ఏమైనారో ఈనాటికీ తెలియదు. ఇప్పటికి ఇరవై సంవత్సరాలైంది.

అదృష్టం కొద్దీ, నా శ్రమ ఫలించి పిల్లాడు 'లాయర్' అయ్యాడు. అమ్మాయికి పెళ్ళయి అయిదేళ్ళయింది. అబ్బాయికి క్రితం ఏడాది పెళ్ళి చేసాను. ఈ విషయాలన్నీ నీకు తెలుసో లేదో నాకు తెలియదుగానీ, నీ విశేషాలు నేను వింటూనే ఉన్నాను. నువ్వు అలాగే ఉన్నావని తెలిసి బాధపడ్డాను. ఎందుకోగానీ, నీతో కలిసి శేషజీవితం గడపాలని మళ్ళీ కోరిక కలుగుతోంది. నన్ను ధైర్యంగా నీ జీవితంలోకి ఇప్పటికైనా ఆహ్వానించగలిగితే, ఈ దిగువ ఇస్తున్న అడ్రస్‌కి రాగలవు.

-శాంతి

''ఎప్పటి శాంతి?'' ఉత్తరం మడిచి మంచం మీద వాలి సాలోచనగా కళ్ళు మూసుకుంటూ కాంతం అనుకుంటూ ఉండగా, ఆమె ఆలోచనా పుటల్లోకి, హేమ్లెట్ బి.ఎ చదువుతూండగా, తరచూ ఏదో ఒక పనిమీద తన కోసం వచ్చే ఇంటివాళ్ల పిల్ల 'శాంతి' చప్పున గుర్తుకు వచ్చింది.

''ఆమేనా?'' అనుకుంటూ మెల్లిగా డైరీ తిరగేసిందామె. 1960 నించీ పక్కాగా రాసివుంది.

ఆగస్టు 1960.

''అక్కేగానీ లేకపోతే నా జీవితం ఏమైపోనూ? ఈమాత్రం ఓ మనిషిగా నేనున్నానంటే, అదంతా తల్లి లాంటి అక్క చలవే...''

కన్నీళ్ళు చివ్వున పొంగడంతో కళ్ళు మసకలు బారాయి కాంతానికి. గట్టిగా ఒత్తుకుని మరో పేజీ తిప్పింది..

జనవరి 1964.

''కొత్తగా ఇల్లు మారాము. ఇంటివాళ్ళ అమ్మాయి బహు గడుసు. ఏదో ఒక వంకతో నన్ను ఆటలు పట్టించడం ఆ పిల్లకి సరదా కాబోలు.''

సెప్టెంబరు 1964.

ఇవాళ శాంతి అల్లరి మరీ మితిమీరింది.

''కాంతంగారూ! కాంతంగారూ!'' అంటూ వచ్చింది.

''స్నానానికి వెళ్ళింది'' ముభావంగా అన్నాను నేను.

''అబ్బ ఏమదృష్టం. ఇలాంటి ఘడియకోసం ఎప్పటినించి ప్రయత్నిస్తున్నానో తెల్సా. అయినా, ఉత్త బడుద్ధాయివి నీకేం తెలుస్తుందిగానీ చెప్పేస్తున్నా. మనసులో మాట విను. నీవు చాలా బాగుంటావ్ హేమూ. నీ అందమంతా ఎక్కడుందో చెప్పమంటావా?

నీ క్రాపులో

రాజేంద్రకుమార్‌లా చూసే నీ చూపులో

ఎప్పుడూ నోరు విప్పని నీ మౌనంలో

ఆరడుగుల పొడుగులో ఇంత అందంగా ఉన్నా, అలాగున్నావని తెలియని 'నీ తెలియనితనంలో'

ఆమె అలా చెప్పుకుపోతూ ఉంటే నాలో బోలెడు అలజడి. ''శాంతీ! ఎవరన్నా చూస్తే బాగుండదు. వెళ్ళిపో'' అన్నాను గంభీరంగా.

''ఓహో. ఈ సంగతి చెప్పవేం?..ఎవరూ చూడకపోతే బాగుంటుందన్నమాట..ఓ మంచి సంగతి చెప్పనా?...నాకు ఫారిన్ వెళ్ళిపోదామని ఉంది'' అంది హఠాత్తుగా.

''ఎందుకు?'' ఆశ్చర్యంగా అన్నాను.

''ఎందుకేమిటీ. అక్కడ మొగుడు పెద్దా, పెళ్ళాం చిన్నా ఉండాలన్న నిబంధనలేవీ ఉండవుట.''

''దాని సంగతెందుకు?''

''ఆ..ఈ మొద్దబ్బాయికన్నా ఓ ఏడాది పెద్దదాన్ని కదా అందుకూ..''

''ఆ!'' ఆశ్చర్యంగా అన్నాన్నేను.

''ఆ!'' ముందుకు వంగి ముద్దుగా అంటున్న ఆమెను...

బాల్చీ దబ్బున పెట్టిన చప్పుడైంది. అక్క వచ్చినట్లుంది.

నేను సీరియస్‌గా ఏదో రాసుకోసాగాను.

శాంతి మహా గట్టిదని అప్పుడు అర్ధమయ్యింది



నాకు.

''కాంతంగారూ! కర్వేపాకుంటే అడిగిరమ్మని అమ్మ పంపింది. ఈ బుద్ధావతారం గారు నోరు విప్పితేనా?'' అంటూ లోనికి వెళ్ళిపోయిందామె-

శాంతి!...అవును. ఈ సంఘటన తనకీ గుర్తుంది. ఆ పిల్ల తన తమ్ముడిని ఎక్కడ ఎగరేసుకు పోతుందో అని భయపడి చచ్చేది తాను. తన పెళ్ళైన కొన్నాళ్ళకి తల్లి దండ్రులూ, ఆపై కొన్నాళ్ళకి భర్త పోవడంతో తన నలుగురు పిల్లల్తో, హేమ్లెట్‌తో ఉండేది తాను. వాడ్ని చాలా ప్రేమగానే పెంచింది తాను. ఎంతో అందంగా ఉండే హేమ్లెట్ మీద ఏ స్త్రీ నీడా పడకుండా జాగ్రత్తపడింది తాను. ఎందుకంటే హేమ్లెట్‌గానీ పెళ్లి చేసుకుంటే తాను 'నిరాశ్రయురాలు' అవుతుందన్న భయంతో అనుకుంది కాంతం మరో పేజీ తిప్పుతూ.

సెప్టెంబరు 1965.

''ఆ పిల్ల నీకన్న పెద్దది హేమూ. అది చాలా అరిష్టం నాయనా. నీకేదైనా అయితే నేను భరించలేను'' అంటూ ఏడ్చింది అక్క, శాంతి గురించి వచ్చిన ప్రస్తావన మధ్యలో. గతుక్కుమన్నాను.

ఏం చెయ్యను? శాంతిని చూస్తే నాలో చెప్పలేని ఆనందం ఉరకలు వేస్తోంది. ఆమె మా యింటికి వస్తే, ఇంటికే కాంతి వచ్చినట్లుంటోంది. ఆమె అంటే నాకు కూడా ఇష్టం అని ఇప్పుడే అర్థం అవుతోంది. ఎలా కనిపెట్టేసిందో అక్క. అలా అని ఏడ్చేసింది?

చేసుకుంటే అక్కని బాధపెట్టిన వాడినవనా? లేకపోతే నన్నింతగా కదిలించిన శాంతి మనసుకి గాయం చేసిన వాడినవనా? ఎలాగ?..ఎలాగ?...

అక్టోబర్ 1965.

శాంతికి పెళ్ళి కుదిరింది. భగవాన్!

ఎలాగ?...శాంతికి దూరంగా నేను బ్రతకగలనా?-

''పిచ్చి సన్నాసికి అప్పట్లో ఎంత జబ్బు చేసిందనీ?..అయినా చాలా మొండిగా నిలబడింది తాను. ప్చ్..'' నిర్లిప్తంగా అనుకుంది కాంతం.

డిశంబర్ 1965.

''అక్క దేవత. టైఫాయిడ్ వచ్చి ఎంత నీరసపడ్డాను. ఏదో అక్కా, పిల్లలూ దగ్గర ఉన్నారు కనుక నన్ను ఆదుకున్నారు. కంటికి రెప్పలా కాపాడింది అక్క. ఎన్ని జన్మలెత్తినా ఈ ఋణం తీర్చుకోలేనేమో?''

మరోసారి నీళ్ళు చిప్పిల్లాయి కాంతం కళ్ళల్లో. గట్టిగా ఒత్తుకుని మరో పేజీ తిప్పింది.

జూలై 1968.

వైజాగ్‌లో ఏవీయన్ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది..ఓగాడ్! నన్ను కన్నతల్లిలా ఆదరించిన అక్కనీ, ప్రేమగా చూసుకునే పిల్లలనీ ఆదుకునే శక్తిని ఇచ్చావు..నీకిదే నీ నమస్కారం-

ఏప్రిల్ 1969.

పీటర్ చాలా మంచివాడు. నేనంటే చాలా అభిమానం. వాళ్ళ ఫాదర్ విలియమ్స్‌గారు, వాళ్ళ మదర్ చిన్నప్పుడే పోయినా మరో వివాహం చేసుకోలేదు. పాపం! పీటర్ చెల్లి రోజీ చాలా చలాకీ పిల్ల. చదువులో మాత్రం చాలా పూర్. టెన్త్ రెండుసార్లు ఫెయిలయిందిట. దాంతో చదువంటే విరక్తి పెంచుకుని ఇంటి పనులపై శ్రద్ధ పెట్టిందిట. ఇల్లు ఎంత చక్కగా సద్దుతుందనీ..?

జనవరి 1970.

అక్క 'సునీతని' చేసుకోమంటోంది. కానీ సునీత వాళ్ళ కాలేజీలో రవిని యిష్టపడుతున్నానని చెప్పింది.

ఈ చిక్కుముడిని ఎలాగ విప్పడం?..

నిజమే..సునీతని హేమ్లెట్ చేసుకుంటే బాగుంటుందని తాను చాలాసార్లు అనుకుంది. వాడు సమాధానం చెప్పకపోతుంటే చాలాసార్లే విసుక్కునేది తాను. ఏనాడైనా నోరు విప్పి వీడు మాట్లాడితేనా? అనుకోకుండా సునీత రవిని చేసుకున్న నాడు అవాక్కయింది తాను.

పోనీ తరవాతి పిల్ల అయినా హేమ్లెట్‌ని చేసుకుంటుందేమోనని అడిగింది తాను సరోజని. అది ''ఆ..ఆ ముసలాణ్ణి నేను చేసుకోను'' అని తెగేసి చెప్పింది. సరోజకీ, సంధ్యకీ మంచి మంచి సంబంధాలే చేసాడు హేమ్లెట్, చాలా డబ్బు ఖర్చుపెట్టి. మరో పేజీ తిప్పిందామె అన్యమనస్కంగా.

జనవరి 1977.

"డిశంబరు 31 మిడ్నైట్ చాలా బాగుంటుంది. మా యింటికి రండి సిస్టర్, నువ్వూ.." అని పీటర్ బలవంతం చేసి తీసుకుని వెళ్ళాడు మా యిద్దరినీ. రోజీ ఇదివరకటికన్నా ఎంతో బాగుంది. ఆమె పెద్ద పెద్ద కళ్ళూ... బండ పెదవులూ, ఆమె నవ్వుతుంటే మరింత బాగున్నాయి. సడెన్‌గా కరెంటు పోయింది.

ఎవరో నా దగ్గరగా వచ్చినట్లైంది. నేను నోరు విప్పేంతలో నా నోరు గట్టిగా మూసి నన్నల్లుకుపోతూ "ఐలైక్యూ, ఐలవ్యూ" అన్న పదాలు గుసగుసగా వినిపించాయి... ఆ కోలాహలంలో.. ఆమె?.. యస్.. డెఫినిట్‌గా రోజీయే అయి వుంటుంది.

'టక్'మని కరెంటు వచ్చింది. పక్కనే ఉన్న రోజీ ఫ్లౌరెన్సుని గట్టిగా పట్టుకుని మాట్లాడుతోంది ఏదో. ఇంటికి వచ్చినా ఆమె నన్నల్లుకున్నప్పుడు నా శరీరంలో ఉత్పన్నమైన పులకలు అణగలేదు... అలాగ గుర్తుకు వస్తూనే ఉన్నాయి.

ఫిబ్రవరి 1977.

"సర్! మీరు 'ఊ' అంటే నేను జేమ్స్‌తో పెళ్ళి కాన్సిల్ చేసుకుంటాను. నేనీమధ్య అసలు నాన్‌వెజ్ తినడం లేదు. ప్రామిస్. మీ సమాధానం ఓ వారంలోగా చెప్పరూ?" అని రోజీ లెటర్ రాసింది.

"అక్కకి ఎలాగ చెప్పాలి?..ఎలాగైనా చెప్పాలి.." అంటూ చాలా కూడగట్టుకుని, రెండురోజుల మథనం తరువాత, "అక్కా నీతో ఓ సంగతి మాట్లాడాలి.." అన్నాను బలవంతాన.

"రారా. నీకూ నేనో సంగతి చెప్పాలి. రోజీ పెళ్లి కుదిరింది. చనిపోయిన 'మేరీ'కి ప్రామిస్ చేసినట్లుగా ఆమెని జేమ్స్‌కి ఇస్తున్నాము" అన్నారు విలియమ్స్‌గారు మొన్న జాన్యువరి ఫస్టు సెలెబ్రేషన్స్‌లో. వాళ్ళు వాళ్ళంతా చాలా అభినందించారు. అయినా ఆ పిల్ల ప్రవర్తన నాకు వికారాన్ని కలిగించింది. ఏంటో కొందరు అలాగ ఉంటారు.. అది సర్లే.. నువ్వేం చెప్పదల్చుకున్నావు?" అంది.

"ఏం లేదక్కా...ఏం లేదు... అదే నేనూ రోజీ పెళ్ళి కుదిరిందని చెప్పుదామనుకున్నాను..." అంటూ గబగబా రూంకి వచ్చేసేను.

"ఓ గాడ్.. అక్కకి ఇష్టంలేని పని నేను చెయ్యగలనా? నాకై జీవిత పథాన్నే మార్చుకుందుకు సిద్ధపడ్డ రోజీని మరువగలనా?"

★★★

"అప్పుడు వీడికి మరోసారి ఉధృతంగా టైఫాయిడ్ వచ్చింది. ఎంత బాధ అనుభవించాడు. అప్పటికి రవికీ సునీతకీ మధ్యపడక, గొడవలు పడుతున్నారు. సంధ్యా, సరోజా ఒకరి వెనుక మరొకరు 'పురుళ్ళ'కి రెడీగా ఉన్నారు. 'రోజీ'నిగానీ హేమ్లెట్ చేసుకుంటే తన బ్రతుకు ఏమౌతుందోనన్న భయం వల్ల తానే అలాగ మాట్లాడింది. తన స్వార్థం కోసం వీడి జీవితాన్ని సర్వనాశనం చేసింది తాను" చెంపలపై వరదలాగ కన్నీరు పొంగుతూంటే అనుకున్నదామె.

"అమ్మా..అమ్మా..ఇక్కడా ఉన్నావు. ఏంటి అలాగున్నావు?..ఏమైందమ్మా? మావయ్యేవన్నా అన్నాడా?" గాభరాగా వస్తూ అంది సునీత.

మౌనంగా డైరీ, లెటరూ ఆమె చేతిలో పెట్టింది కాంతం. సాంతం చదివిన సునీత ముఖం పాలిపోయింది.

"అమ్మా. హేమ్లెట్ తాతగార్కి జ్వరం తగ్గలేదు" అంటూ వచ్చాడు ప్రకాష్. సునీత, కాంతం గంభీరంగా ఉండడంతో "ఏమైందమ్మా" అన్నాడు ఆత్రంగా.

"ఏం లేదుగానీ నువ్వటెళ్ళి తాతగారి దగ్గర కూర్చో.." అంటూ లోనికి నడిచారు ఇద్దరూ.

రెపరెపలాడే ఉత్తరమూ, తిరగేసి పెట్టిన డైరీ అతని దృష్టిని దాటిపోలేదు.

"అయినా శాంతమ్మకి ఇదేం మాయరోగమే" అంది సునీత.

"వాడు మథనపడుతున్నాడు. ఈ నరకం ఇంక నేను అనుభవించలేను" అంది కాంతం.

"ఏంటే అమ్మా అలాగంటావు? మా ఆయన స్థిరం తక్కువ వాడని నీకు తెలియదూ! నా కొడుకులిద్దరూ ఇంజినీరింగు మూడో ఏడూ, మొదటి సంవత్సరమూ అని నీకు తెలియదూ? ఏం ఫర్లేదు. ఏమీ అయిపోదు. అయినా ఈ వయసులో ఛి...ఛీ.." అంది సునీత.

ప్రకాష్ భృకుటి ముడిపడింది. యధాలాపంగా డైరీ, లెటరూ తిరగేశాడు.

"వస్తానమ్మా. మరేం దిగులు పడకు. రేయ్ నడు..ఇంట్లో బోలెడు పని ఉంది. మావయ్యని జాగ్రత్తగా చూస్కోమ్మా..వస్తాము" అంటూ స్తబ్దుగా ఉన్న ప్రకాష్‌ని తట్టుతూ అంది సునీత.

★★★

ఆ మర్నాడు సునీత, ప్రకాష్ వచ్చారు. హేమ్లెట్ పరిస్థితిలో మార్పులేదు. మళ్ళీ తల్లీకూతుళ్ళు గదిలో తర్జన భర్జనలు చేసి బయటకు వచ్చారు. ప్రకాష్ పిట్టగోడ నానుకుని కిందకి చూస్తున్నాడు సాలోచనగా.

"నడు నాన్నా. ఇంట్లో బోలెడు పని ఉంది" అంది సునీత.

"ఏమాలోచించుకున్నారు?" అన్నాడు ప్రకాష్.

"ఏ విషయం?"

"నాకేం తెలియదు అనుకోవద్దు."

"నువ్వేమీ గాభరా పడక్కరలేదు నాయనా. నీ చదువు ఏ ఇబ్బందులూ లేకుండా అయిపోతుంది..నీకూ.."

"ఈ వయసులో..శాంతమ్మకి మతిపోయి వుంటుంది" అంది కాంతమ్మ కల్పించుకుంటూ.

"అమ్మమ్మా! నీ కుటుంబం, నీ పిల్లల కుటుంబాలు పైకి వెళ్ళడానికి నిచ్చెనలాగ ఆయన పని చేస్తున్నారు. ఆయన కోసం ఆయన బ్రతికే అవకాశం ఇక ఈ జన్మలో మీరు ఇవ్వరా?" కాంతమ్మా, సునీతా విభ్రాంతిగా చూశారు ప్రకాష్ వైపు.

"మా చదువులు ఏమీ ఆగవు. మా నాన్న పట్టించుకోకపోయినా, ఏదైనా బేంకులో ఎడ్యుకేషన్ లోన్ తీసుకుంటాము...అమ్మమ్మా! ఇప్పటికే చాలా 'పాపం' మూటకట్టుకున్నావు. నువ్వు చేసిన పొరపాట్లు దిద్దుకునే అవకాశం భగవంతుడు నీకు మళ్ళీ ఇచ్చాడు..ఇప్పటికీ నువ్వు..సర్లె. ఆ లెటర్ ఇటియ్యి. నేను తీసుకువస్తాను ఆమెని" అంటూ మాటా పలుకూ లేకుండా నిలబడ్డ వారిని తోసుకుంటూ గదిలోకి వెళ్ళి లెటర్ అందుకుని మెట్లవైపు నడిచాడు ప్రకాష్.

"నాయనా ప్రకాష్!" బొంగురు గొంతుతో పిలిచింది కాంతం.

"సారీ అమ్మమ్మా! మీ మాటలు నేనిక వినదలచుకోలేదు" గిరుక్కున వెనుతిరిగి అన్నాడు ప్రకాష్.

"ఎంత్రా ఆ పొగరూ..పెద్దదన్న మర్యాద కూడా లేకుండా.." అంది సునీత.

"వాడినేమీ అనకమ్మా..చిన్నపిల్లవాడైనా చక్కగా ఆలోచించాడు వాడు...నాయనా! ఈ పొరపాట్లు చేతులారా చేసినదాన్ని నేను. అది దిద్దుకునే అవకాశాన్ని నాకివ్వు. నన్ను కూడా నీతో బాటు తీసుకెళ్ళు నాయనా.." అంది కాంతం.

★

## హిందీలో కీర్తిరెడ్డి



కీర్తి రెడ్డి నటించిన 'తొలిప్రేమ' సూపర్ డూపర్ హిట్టయింది. అయితే ఇదే ఆమె తొలి సినిమాగా చాలా మంది అనుకుంటారు. కానీ ఆమె ఎస్వీ కృష్ణారెడ్డి తీసిన 'గన్‌షాట్'లో హీరోయిన్‌గా పరిచయం అయింది. కానీ ఆ సినిమా పరాజయం కావడంతో ఆ విషయం మరుగున పడిపోయింది. 'తొలిప్రేమ' ఘన విజయం తర్వాత ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటున్న కీర్తి ప్రస్తుతం తెలుగులో ఒకే ఒక చిత్రంలో నటిస్తోంది. ఇందులో హీరో నవీన్ వడ్డే హీరో. అదలా వుంటే- 'తొలిప్రేమ' చిత్రాన్ని అమితాబ్ తన కుమారుడు అభిషేక్ హీరోగా తీయాలనుకుంటున్నాడు. ఇందులో కూడా తెలుగు వెర్షన్ హీరోయిన్ కీర్తిరెడ్డినే తీసుకోవాలనుకుంటున్నట్లు వినికిడి. అంటే అటు హిందీ వారికి కూడా కీర్తి పరిచయం కాబోతోందన్నమాట.

-జె.ఎం.